క్లుప్తంగా

అమ్మవారి విగ్రహ నిమజ్జనం



చుండూరు(వేమూరు): చుండూరు మండలం చినపరిమి గ్రామంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని ఆదివారం ఊరేగింపుతో కూచిపూడి లాకుల వద్ద నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



బాపట్ల: పీఎస్‌హెచ్‌ఎం అసోసియేషన్, విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఉపాధ్యాయులుగా ఉత్తమ ప్రతిభ చూపిన వారిని ఈసందర్భంగా సన్మానించారు. బ్యాంక్ మేనేజర్ ఆదాడ అర్జున్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదన్నారు. పీఎస్‌హెచ్‌ఎం అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని వృత్తులలో పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి అని, ఉపాధ్యాయులు నిరంతరం కష్టపడి మెరుగైన సమాజాన్ని ఏర్పాటు చేయుటలో నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రిటైర్డు అధ్యాపకులు డాక్టర్ పి.సి.సాయి బాబా, ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల ప్రిన్సిపాల్ బొంతగొర్ల వీర రాఘవ, ఎర్ర సత్యనారాయణ, తోట శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు వైద్యశిబిరం



లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో హెల్త్ ఆన్‌వీల్స్ రైలు ద్వారా గుంటూరు– నడికుడి సెక్షన్ మధ్య వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పీఆర్‌ఓ వినయ్‌కాంత్ మాట్లాడుతూ ఈ శిబిరానికి డివిజన్ వైద్య విభాగం సంయుక్తంగా నిర్వహించి డాక్టర్ ప్రకాష్, సీనియర్ డివిజనల్ మెడికల్ హెల్త్ యూనిట్ డాక్టర్ బి.మహర్షి సేవలు అందించినట్లు చెప్పారు. గుంటూరులోని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రులైన లలిత సూపర్ స్పెషలిటీ, శంకర ఐ ఆస్పత్రి, ఒమేగా క్యాన్సర్ సెంటర్ నుంచి వైద్య నిపుణులు హాజరై సేవలు అందించారని తెలిపారు.

కళలను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత

పెదకాకాని: సమాజంలో అంతరించిపోతున్న కళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరూ బాధ్యత అని వీరభద్ర సాంస్కృతిక కళాసమితి వ్యవస్థాపకుడు ఉల్లంగుల బ్రహ్మయ్య అన్నారు. మండల పరిధిలోని వెనిగండ్ల శివాలయంలో విజయ దశమి సందర్భంగా రెండు రోజులుగా పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. గుంటూరు శివ శక్తి కళానాట్యమండలి పర్యవేక్షణలో తొలిరోజు ఆదివారం శ్రీకృష్ణరాయబారం నాటకంలోని సన్నివేశంతో పాటు సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం ప్రదర్శించారు. అలానే రెండో రోజు సోమవారం పోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్ర నాటకం ప్రదర్శించనున్నారు. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత సంస్కృతి సౌజన్యంతో నాటక ప్రదర్శనల సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఉల్లంగుల బ్రహ్మయ్య మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన నిత్య జీవనంలో ప్రతి ఒక్కరిలో ఉత్సాహం, ఉల్లాసం, ఆనందం నింపేదుకు కళా ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మహనీయుల చరిత్రలను తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరూ అంతరించి పోతున్న కళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. అనంతరం పలువురు స్థానిక పెద్దలు కళాకారులను సత్కరించారు.

నడికుడి రైల్వే స్టేషన్‌లో భద్రతా సదస్సు

లక్ష్మీపురం:సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నడికుడి రైల్వే స్టేషన్‌లో భద్రతా సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీఓఎం జె.శ్రీనాథ్ మాట్లాడుతూ ఈ సదస్సులో ఆపరేటింగ్ సిబ్బంది భద్రతా గురించి అవగాహన కల్పించారు. ప్రధానంగా ఎమర్జెన్సీ రూట్ రద్దు విధానం, ఎమర్జెన్సీ పాయింట్ ఆపరేషన్, పవర్ బ్లాక్, ఫ్లాట్ టైర్, హాటల్ యాక్సిల్ నిర్వహణ, రేక్ కదలిక, కార్యాచరణ పరిమితుల గురించి తెలిపారు. అలాగే సాధారణ, అసాధారణ పని సమయంలో ఎల్‌సీ గేట్, నాన్ ఇంటర్ లాక్ ఎల్‌సీ గేట్ విధానం గురించి అవగాహన కల్పించారు.

సిరులు కురిపిస్తున్న వేరుశనగ

- జిల్లాలో ఏడాదిలో రెండు, మూడుసార్లు వేరుశనగ సాగు
- మహానేత వైఎస్సార్ పుణ్యమే అంటున్న అన్నదాతలు
- ఉచిత విద్యుత్‌తో బీడు భూములు సాగులోకి..

బాపట్ల: జిల్లాలోని బాపట్ల, చీరాల, వేటపాలెం, చిన్నగంజాం, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల పరిధిలో వేరుశెనగ సేద్యం ముమ్మరంగా సాగుతుంది. బాపట్ల జిల్లాలో కోస్తా తీరప్రాంతంలో 15వేల ఎకరాలకు పైగా వేరుశనగ సాగు చేస్తున్నారు. ఒకప్పుడు బాపట్ల నియోజకవర్గంలోని కర్లపాలెం మండలానికి వెళ్లే దారిలో ఏటు చూసినా ఖాళీపొలాలు, అక్కడక్కడ ఆకుకూరలు, కూరగాయల సాగుచేసే పొలాలు దర్శనం ఇస్తుండేవి. ప్రస్తుతం పుడమితల్లి పచ్చదనం అందినట్లుగా ఏడాది పొడవునా ఎప్పుడుచూసినా పచ్చని వేరుశనగ పైర్లతో కళకళలాడుతున్న పంటపొలాలు మండలానికి చేరుకునే ప్రజలకు స్వాగతం పలుకుతున్నాయి. అదేవిధంగా బాపట్ల మండలంలోని మరుప్రోలువారిపాలెం, పిన్నిబోయినవారిపాలెం, పాందురంగాపురం, అడవిపల్లిపాలెం, దరివాదకొత్తపాలెం గ్రామంలో కూడా రైతులు వేరుశనగ సాగుకు శ్రీకారం చుట్టి ప్రస్తుతం వాటిని పీకుతున్నారు.



పీకిన వేరుశనగ మొక్కలను కట్టలు కట్టి తరలిస్తున్న దృశ్యం (ఫైల్)



వేరుశనగ చేలో పని చేస్తున్న రైతులు, కూలీలు (ఫైల్)

ఉచిత విద్యుత్‌తో మహర్దశ..

గతంలో నీటి సౌకర్యం లేక అటవీశాఖ భూములను తలపించేలా ఉండే ఈ ప్రాంత పంటపొలాలు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్ పథకం ద్వారా సశ్యస్యామలమయ్యాయి. ఈ పథకం కింద మండలంలోని దుండివారిపాలెం, బోలాయపాలెం, తిమ్మరెడ్డిపాలెం, ఏట్రవారిపాలెం, దమ్మనవారిపాలెం, శ్రీరాంనగర్, ఎం.వి.రాజుపాలెం, కొత్తనందాయపాలెం, నల్లమోతువారిపాలెం, పాతనందాయపాలెం గ్రామాల్లో సుమారు 600 మంది రైతులు ఆయా పొలాలకు సుదూర ప్రాంతం నుంచి విద్యుత్ లైన్లు సౌకర్యం ఏర్పాటు చేసుకొని పొలాల్లో బోర్లు దింపి వాటి సహాయంతో మొదట్లో 700 ఎకరాలతో వేరుశనగ పైరుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం జిల్లాలో 15వేల ఎకరాల స్థాయికి చేరింది. ఆయా గ్రామాల్లోని ఏ ఒక్కరైతును పలుకరించినా మహానేత పెట్టిన ఉచిత విద్యుత్ పథకమే మా బతుకుల్లో వెలుగులు నింపిందంటూ ముక్తకంఠంతో చెబుతారు

5వేల కుటుంబాలకు నిత్యం ఉపాధి..

ఒకప్పుడు మండలంలోని కూలీలకు ఖరీఫ్ సీజన్‌లో ఉండే వ్యవసాయ పనులు మినహా ఏడాదంతా ఖాళీగా ఉండేవాళ్లు. ప్రస్తుతం వేరుశనగ సాగు ఏడాది పొడవునా సాగుచేయటం వలన ఆయా గ్రామాల్లోని సుమారు 5వేల మంది కూలీలు ఏడాది పొడవునా వేరుశనగ పొలంలో తక్కురొల్లడం, కలుపుతీయటం, కాయలు కోయటం, కల్లాలను శుభ్రం చేయటం కాయలు నుంచి పప్పును వేరుచేయటం లాంటి పనులు నిత్యం ఉంటున్నాయి. దీంతో ఉపాధికోసం వలసలు వెళ్లే అవసరం లేకుండా గ్రామంలోనే ఉపాధి దొరుకుతుందని కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహానేత వైఎస్సార్ పుణ్యమే..



మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన ఉచిత విద్యుత్ ద్వారానే బోర్లు ద్వారా ఈ ప్రాంతంలో వేరుశనగ సాగు చేయటం ప్రారంభించారు. గతంలో ఇక్కడి భూములన్నీ బీడు భూముల్లా ఎందుకు పనికిరాకుండా ఉండేవి. మహానేత పుణ్యం వల్ల ఇక్కడ ఉచిత విద్యుత్‌తో బోర్ల ద్వారా వేరుశనగ పండించుకుంటున్నాం.

– వేంకటేశ్వరరెడ్డి, కావూరివారిపాలెం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చుండూరు(వేమూరు): చుండూరు మండలం యడ్లపల్లిలో విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా విద్యుత్ సోమవారం నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీరు దోనేపూడి అర్జునరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్మిక సమస్యలను పరిష్కరించండి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ కోరారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేష్ నెరవేర్చాలన్నారు. జీలగ వెంకటేశ్వర్లు, బి. సూర్యప్రకాష్, వై.సాంబశివరావు, డి.నాగేశ్వరరావు, గురవయ్య, అంకయ్య, జానీ బాష పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ సేవలు ఎనలేనివి

చెరుకుపల్లి: సమాజానికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) సేవలు ఎనలేనివని రేపల్లె ఖండ్ కార్యవాహ్ ఉప్పు సాంబశివరావు అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం (ఆర్‌ఎస్‌ఎస్) 100 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా చెరుకుపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన విజయ దశమి ఉత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎటువంటి విపత్తు వచ్చినా ముందుగా స్పందించి సేవా కార్యక్రమాలలో పాల్గొనేది స్వయం సేవక్ సంఘ సేవకులేనని చెప్పారు. కేశవ రామ్‌బలిరామ్ హగ్దేవార్ 17 మందితో స్థాపించిన ఈ సంఘం నేడు ప్రపంచంలో అన్ని దేశాలలో విస్తరించిందన్నారు. సంఘ ప్రముఖులు దామర్ల నరసింహారావు, కోట సత్యనారాయణ, మోహమాటం శ్రీనివాసరావు, రాంపల్లి జగన్నాథశాస్త్రి,కోట విజయ్‌కుమార్, యెల్లెల రజని, గొల్లపూడి శ్రీనివాసరావు, విశ్వంశెట్టి శ్రీనివాసరావు, ఆలపాటిసుధారాణి, సేవక్‌లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ రేపల్లె ఖండ్ కార్యవాహ్ ఉప్పు సాంబశివరావు

స్వాతంత్య్ర పోరాట దీప్తి కల్లూరి తులశమ్మ

24వ వర్థంతి నివాళిలో మారౌతు సీతారామయ్య

తెనాలి: రూరల్ మండల గ్రామం పెదరావూరులో ప్రముఖ స్వాతంత్య్రయోధురాలు కల్లూరి తులశమ్మ 24వ వర్థంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గల తులశమ్మ కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. స్వాతంత్య్ర పోరాటంలో ఆమె చేసిన త్యాగాలను స్మరించారుకున్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ అధ్యక్షుడు మారౌతు సీతారామయ్య మాట్లాడుతూ గాంధీజీ పిలుపుతో కల్లూరి తులశమ్మ ఒంటిపైనున్న బంగారు నగలను విరాళంగా ఇవ్వటమే కాకుండా, స్వాతంత్య్ర ఉద్యమానికి అవరోధం కలుగుతుందనే భావనతో భర్తను ఒప్పించి, ఆయనకు స్వయంగా మారుమనువు చేసి మరీ స్వరాజ్య పోరాటంలో పాల్గొన్నట్లు చెప్పారు. జైలులో కూడా తన ఉద్యమాన్ని కొనసాగించి, మరింత జైలుశిక్షను అనుభవించిన పోరాటయోధురాలు తులశమ్మ అన్నారు. స్వాతంత్రం సిద్ధించిన తర్వాత కూడా జీవితాంతం నిరాడంబర జీవనం, ఖాదీ ప్రచారం, ఖాదీవస్త్రాల అమ్మకంతో జీవనం సాగించినట్లు గుర్తుచేశారు. అలాంటి త్యాగధనులను నేటితరం గుర్తుచేసుకుని, స్ఫూర్తిని పొందాలని సూచించారు. శాఖమూరి తిమ్మానాయుడు, పాలడుగు సురేంద్ర, కొడాలి పూర్ణచంద్రరావు, గోగినేని కిశోర్‌బాబు పాల్గొన్నారు.



తులశమ్మ విగ్రహం వద్ద నివాళి

దోషులను కఠినంగా శిక్షించాలి

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

తాడేపల్లి రూరల్: అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి రూరల్ గుండిమెడలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం దారుణమన్నారు. దళితుల మధ్య తగాదాలు పెట్టడానికి, ఐక్యతను దెబ్బతీసేందుకు ఇలాంటి దుర్మార్గమైన చర్యలు గుర్తు తెలియని వ్యక్తులు చేశారన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే తాను ప్రధానిని అయ్యానని చెప్పుకునే నరేంద్రమోదీ రాజ్యాంగబద్ధంగా పరిపాలన సాగించడం లేదని విమర్శించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా చర్యలు తీసుకుంటోందని మండిపడ్డారు. బడ్జెట్‌లో, నిధుల కేటాయింపులో దళితులకు, గిరిజనులకు అన్యాయం జరుగుతోందన్నారు. చిత్తూరు జిల్లాలో జరిగిన దుర్మార్గమైనఘటనకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, నేతలు జోషి, నాగపోగు విజయరాజు, బత్తుల సంసోన్, ఎం. చిన్న, తంబి, ఏసురత్నం, చిన్నప్ప, కృష్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో కేవీపీఎస్ నేతలు

రెండు లేగదూడలకు జన్మనిచ్చిన గోమాత

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లిలో ఓ గోశాలలో ఓ గోమాత ఆదివారం రెండు లేగదూడలకు జన్మనిచ్చింది. నిర్వాహకులు బొంతు శ్రీనివాసరెడ్డి (అరవింద శ్రీనివాస్‌రెడ్డి) తెలిపిన వివరాల ప్రకారం తాను నిర్వహిస్తున్న గోశాలలో ఒకే కాన్పులో రెండు కోడెదూడలకు ఓ గోమాత జన్మనిచ్చిందని, అలా జన్మించడం మా అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారన్నారు. తాడేపల్లి పశువైద్యులు సురేష్ మాట్లాడుతూ జన్యులోపంలో వచ్చే మార్పుల కారణంగా లేగదూడలు ఇలా జన్మించాయని తాడేపల్లి ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో గోశాలలో ఆవులకు సెమన్ అందిస్తున్నామని తెలిపారు.



లేగదూడలు

8 నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

తెనాలిఅర్బన్: జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా తపాలా శాఖ ఆధ్వర్యంలో తెనాలి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 8 నుంచి 14 వరకు ఆధార్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ జీవీ బాలసరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి సేవలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. 8,9 తేదీల్లో తెనాలి దేవిచౌక్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో, 10, 11 తేదీల్లో బాపట్ల జిల్లా, కొల్లూరులోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో, 13,14 తేదీల్లో తెనాలి రైల్వే స్టేషన్‌రోడ్డులోని ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కళాశాలలో క్యాంపులు జరుగుతాయని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు క్యాంపులు కొనసాగుతాయని, అవసరమైన వారు వీటి సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు.

వీధి కుక్కలను సంరక్షణ కేంద్రాలకు తరలింపు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో వీధి కుక్కలను పట్టుకుని బుర్రిపాలెం రోడ్డులోని సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నట్లు మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మువ్వా యేసుబాబు పేర్కొన్నారు. చెంచుపేట, అమరావతి ప్లాట్స్‌లో ఆదివారం కుక్కలను సిబ్బంది పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో కుక్కలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. వాటి నియంత్రణ కోసం ప్రత్యేక వాహనాన్ని సిద్ధం చేసి దానిలో వాటిని సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నట్లు చెప్పారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

తాడికొండ: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై చర్యలు తప్పవని తాడికొండ సీఐ కె.వాసు హెచ్చరించారు. ఆదివారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే యువకులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే అల్లర్లు, వివాదాలకు దారితీస్తాయని యువత ఎక్కడా మద్యం సేవించవద్దని సూచించారు. ఈ సందర్భంగా పలువురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మిస్సింగ్ కేసు నమోదైనట్లు ఎస్‌ఐ రవీంద్రనాయక్ తెలిపారు. మంగళగిరి పట్టణ పరిధిలోని డ్రైవర్ పేటకు చెందిన మహమ్మద్ ఇలియాస్ కారుల వ్యాపారం చేస్తుంటాడు. ఆయనకు ఇద్దరు కుమారులు. 19 ఏళ్ల చిన్న కుమారుడు మహ్మద్ రజాక్ ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం వరకు చదువుకున్నాడు. చదువు మానివేసి ఇంటివద్దే ఉంటున్నాడు. గత నెల 21వ తేదీన ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లివస్తానని చెప్పాడు. సాయంత్రానికి కూడా ఇంటికి రాలేదు. చుట్టుపక్కల వారిని, బంధువులను అడిగిపా ఎక్కడా ఆచూకీ దొరకలేదు. రజాక్ ఇంట్లో నుంచి వెళ్లే సమయంలో కాఫీ కలర్ టీషర్టు, బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని, ఎత్తు 5.10 ఉంటాడని, తెల్లగా కర్లింగ్ హెయిర్ ఉన్నట్లు తండ్రి ఇలియాస్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన సంగీత విభావరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై ఆదివారం భక్తి సంగీత విభావరి నిర్వహించారు. భక్తిగాన లహరి ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ పాలక మండలి వారు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. బోడపాటి శ్రీనివాసరావు బృందంతో పలు భక్తి గీతాలను ఆలపించారు. కీబోర్డుపై సాయి, తబలపై రమణ వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ పాల్గొనగా బోడపాటి శ్రీనివాసరావును సత్కరించారు.

టపాసులు కాల్చొద్దు అన్నందుకు దాడి

మంగళగిరి టౌన్: ఇంటి ముందు టపాసులు కాల్చవద్దు అన్నందుకు తమపై దాడిచేశారని మంగళగిరి పీఎస్‌లో ఆదివారం జగన్నాథం శివకుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. జగన్నాథం శివకుమార్, భార్య, ఇద్దరు పిల్లలతో మంగళగిరి పట్టణ పరిధిలోని కొత్తపేట, బోరింగ్ సెంటర్ వద్ద రెండేళ్లుగా అద్దెకుంటున్నాడు. ఈ నెల 4వ తేదీ శనివారం రాత్రి 8 గంటల సమయంలో తమ ఇంటి ఎదురు పిల్లలు టపాకాయలు కాలుస్తూ పెద్ద శబ్దాలు చేస్తూ గోల చేస్తున్నారు. శబ్దాలు చేయకండి అని, ఇక్కడి నుంచి వెళ్లమని శివకుమార్ భార్య ఆ పిల్లలతో చెప్పబోతున్నారు. ఈ లోపే ఆ పిల్లల తల్లులు వచ్చి మా పిల్లలు ఇలానే చేస్తారు, ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ ఆమెను తిట్టారు. ఎందుకు తిడుతున్నారని శివకుమార్ వారిని ప్రశ్నించడంతో ఇద్దరిపై దాడిచేశారని, శివకుమార్‌కు, అతని భార్యకు గాయాలయ్యాయి. చినకాకానిలో ఉన్న ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమపై దాడిచేసి, కులం పేరుతో బూతులు తిట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శివకుమార్ కోరారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

చుండూరు జగనన్న కాలనీలో ముళ్లపొదల్లో ట్రాన్స్‌ఫార్మర్

చుండూరు(వేమూరు): చుండూరు జగనన్న కాలనీలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్ల పొదలు అల్లుకుపోయి ప్రమాదభరితంగా మారింది. వర్షం వల్ల గాలులు వీచినపుడు పైన ఉన్న చెట్లు తీగలకు తగిలి ట్రిప్పయి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని స్థానికులు తెలిపారు. అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు ఉన్న ముళ్లపొదలు, చెట్లు తొలగించాలని కోరుతున్నారు.



చుండూరు జగనన్న కాలనీలో ముళ్లపొదల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేయాలి

సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి నేతాజీ

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గంలో పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం నాయకులతో కలసి పుష్కర కాలనీ, సీతానగరం వద్ద ప్ల కార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు మంగళగిరి నియోజకవర్గ పరిధిలో రైల్వే, కొండ పోరంబోకు, ఇరిగేషన్ తదితరప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న పేదలకు ఇళ్లపట్టాలు, ఇంటి స్థలం లేని వారికి రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని పోతురాజు స్వామి గుడి, రన్నింగ్‌రూమ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో సీపీఎం కార్యకర్తలతో కలసి పాదయాత్ర నిర్వహించి దరఖాస్తులు పంపిణీ చేశారు. ఈనెల 17వ తేదీ మంగళగిరిలోని ఎంటీఎంసీ కార్యాలయం వద్ద పేదలందరు దరఖాస్తులతో తరలి రావాలని పిలుపునిచ్చారు. 2016లో కృష్ణా పుష్కరాల సందర్భంగా సీతానగరంలో 500 మంది పేదల ఇళ్లు తొలగించారని, ఆనాడు ఇచ్చిన హామీ నేటికీ నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే గతంలో ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో అర్హులైన పేదలకు రెండు సెంట్ల స్థలం, గ్రామాల్లోని అర్హులైన పేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఇళ్ల స్థలాల సాధనకు ఈ నెల మూడవ తేదీ నుంచి పేదల పేటలో పాదయాత్రలు, కార్యక్రమాలు, పేదలకు అర్జీలు ఇవ్వడం జరుగుతోందన్నారు. 13,14,15 తేదీల్లో ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట దీక్షలు, 17వ తేదీ ఇంటి స్థలాలకు, పట్టాలకు అర్హులైన వారందరితో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, గాదే సుబ్బారెడ్డి, మేరీ, కోట బాబూరావు, దర్శనపు విజయబాబు, అంజిరెడ్డి, సుభాని, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పద్ధతి మారకపోతే పీడీ యాక్ట్

మంగళగిరి టౌన్: రౌడీషీటర్లు ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని లేకుంటే పీడీ యాక్ట్ అమలు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని మంగళగిరి ఎస్‌ఐ రవీంద్రనాయక్ హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవీంద్రనాయక్ మాట్లాడుతూ రౌడీషీటర్లు సన్మార్గంలో నడవాలని, కేసుల పాలుకాకుండా కుటుంబ సభ్యులతో కలసి సంతోషంగా జీవించాలన్నారు. అల్లర్లకు, సెటిల్‌మెంట్లకు, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇవ్వడం నిరంతర ప్రక్రియ అని, ప్రతి ఆదివారం కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. సత్ప్రవర్తనతో మెలిగే వారిపై రౌడీషీట్లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. కార్యక్రమంలో క్రైంసిబ్బంది ఏడుకొండలు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పట్టణ ఎస్‌ఐ రవీంద్రనాయక్

లక్ష్మీనారాయణకు సన్మానం

తెనాలిఅర్బన్: వడ్లమూడిలోని శ్రీ బాలకోటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ అనంత లక్ష్మీనారాయణను గౌడ సంఘ నాయకులు తెనాలిలో ఆదివారం ఘనంగా సన్మానించారు. నూతనంగా చైర్మన్‌గా ఎన్నికైన ఆయనను అభినందించి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. వీరంకి రంగారావు, గీతబంధు సేవా సమితి ట్రస్ట్ చైర్మన్ తుళ్లూరు శ్రీనివాసరావు, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చెన్ను శ్రీనివాసరావు, రాష్ట్ర గౌడ సంఘ నాయకులు బెల్లంకొండ సురేష్, పట్టణ గౌడ సంఘ అధ్యక్షుడు కుంభం బాలాజీ, నియోజకవర్గ కన్వీనర్ గిరి గణేష్, బీసీ సంక్షేమ సంఘ నాయకులు సాంబశివరావు, కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు.